మి నీ క థ

# పెళ్ళయేదెట్లా?

జి. ఎస్.

పార్కులో మూలగా ఉన్న బెంచీమీద ఒక చివరగా మధుమతి కూర్చుని వుంది. రెండో చివర కూర్చున్న మోహన్ ఆకాశాన్ని, చెట్లను, దూరంగా ఆడుతున్న పిల్లలను మార్చి మార్చి చూస్తూ కూర్చున్నాడు.

"ఏదో ముఖ్యవిషయం మాట్లాడాలని చెప్పి నన్ను కూర్చోబెట్టి అరగంట దాటింది. ఇంకా ఎంతసేపని కూర్చోను?" అంది మధుమతి విసుగ్గా. మోహన్ కంగారుపడి ఆమె వైపు చూస్తూ, 'అదేనండీ....అదే....మీకు ఇష్టమైతే పెళ్ళి చేసుకోవాలని....' అనేశాడు గబగబా.

మధుమతి అర్థం కానట్లు చూస్తూ, 'మీ పెళ్ళికి నా ఇష్టం ఎందుకు?' అంది పెంకెగా.

'నేను పెళ్ళాడదల్చుకున్నది మిమ్మల్నే కనుక' అన్నాడు మోహన్, అతని జిడ్డుతనానికి చిరాకు, తడబాటుకి నవ్వు వచ్చాయి మధుమతికి.

'చూడండి మోహన్! మనకు పరిచయమై ఆర్నెల్లుపైనే అయింది. ఒక్క రోజైన నన్ను షికారుకైనా, సినిమాకైనా, కనీసం కాఫీకైనా రమ్మన్నారా? నన్ను కవ్వించే ఒక్క చిలిపి చేష్టకాని, కొంటెమాట విసరటంకాని చెయ్య లేదు. మీ లాంటి జిడ్డుమనిషితో నా ముద్దూ ముచ్చటా ఏం తీరతాయి? అందుకే గుడ్‌బై' అనేసి మధుమతి చరచరా వెళ్ళిపోతుంటే, 'ప్రేమించే పద్ధతి ఇది కాదు కాబోలు' అనుకొని దిగులుగా కూర్చుండిపోయాడు మోహన్.

* * *

సుమారు సంవత్సరం తరవాత ఆ పార్కులోనే చిరుచీకట్లు కమ్ముకుంటున్న సమయంలో తన ఎదురుగా కూర్చొని మాట్లాడుతున్న సునీతను దగ్గరకు లాక్కోబోయాడు మోహన్. భద్రకాళిలా విరుచుకుపడింది సునీత.

'నా కెటువంటి దురుద్దేశమూ లేదు సునీతా! నిన్ను పెళ్ళి చేసుకుంటాను' అంటూ శాంత పర్చబోయాడు మోహన్.

'అయితే మాత్రం! నా అభిప్రాయం తెలుసుకోకుండానే హద్దు మీరుతున్నావా? మూడు ముళ్ళు వేసేవరకు ఓపికపట్టలేనివాడివి పెళ్ళయాక, పెళ్ళాం పండక్కో, పురిటికో పుట్టింటికి వెళ్తే ఎన్ని వేషాలూ వేస్తావో? నిగ్రహం లేని మగవాడంటే నా కసహ్యం' అనేసి విసవిసా వెళ్ళిపోతూంటే, 'నాకింక పెళ్ళయ్యే గీత లేదు కాబోలు!' అనుకొని తల పట్టుకొని కూలబడిపోయాడు మోహన్. □

---

## 'కనక్ ప్రవాసి'కి దొరికిన కథ

'జ్యోతి' పాఠకుల్కు తిలక్ 'పాతకాపు'. నిండా నలభైయేదేళ్ళు నిండకుండానే, తన కవితాశక్తి 'సుతీక్ష్ణంగా విజృంభిస్తున్న' దశలోనే ఆయన కన్నుమూశాడు. శ్రీశ్రీ చెప్పినట్టు 'తిలక్ చనిపోవడం అంటే మిట్టమధ్యాహ్నమే సూర్యుడస్తమించినట్ట'యింది.

# జీవితం

'అమృతం కురిసిన రాత్రి' కవితా ఖండికలతో ఆధునిక కవితారంగంలో తనదయిన ఒక వినూత్న కవితా రీతిని ఏర్పరచి అజరామరుడైన 'తిలక్'ని తెలుగు కవితకు కొత్త అందాలు దిద్దిన కవిగా ఎంద రెరుగుదురో, అసంఖ్యాకంగా రాయకపోయినా ఆధునిక తెలుగు కథకు కొత్తసోయగం తెచ్చిన కథకునిగా అందరూ ఎరుగుదురు. కథల్లోకూడా కవిత్వమే రాశాడు తిలక్. అసహ్యాన్నికూడా అందంగా పలకగలడు తిలక్.

తిలక్ రాసిన కథలు, స్కెచ్‌లు మొత్తం ఇరవైయారుకి మించిలేవు. వాటిలో 21, 'తిలక్ కథలు' పేరుతో పుస్తక రూపంగా రెండు ముద్రణలు పొందినా, 'లిబియా ఎడారిలో', 'జీవితం', 'రాలిన ఆకులు', 'తీవ్రవాద నాయకుడు', 'ఫలితకేశం' అనే అయిదు కథలూ నేటికీ తిలక్ కథాసంపుటంలో చేరలేదు.

నేటివరకు అలభ్యంగా వున్న ఈ 'జీవితం' కథ 1949 ఆగష్టు 'భారతి' సంచికలో 'శ్రీ కనక్ ప్రవాసి'కి లభించింది.

—ఎడిటర్

⟶

కీ. శే. దేవరకొండ బాలగంగాధర తిలక్

జననం : ఆగస్టు 1921 మరణం : జూలై 1966